క్లుప్తంగా

జి.పుల్లారెడ్డిలో పాణ్యం అసెంబ్లీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్



పుల్లారెడ్డి కాలేజీలో సదుపాయాలపై ఆరా తీస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయనున్నట్లు జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపా రు. బుధవారం ఆమె కాలేజీని సందర్శించి మౌలిక వసతులు, పార్కింగ్ ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించి నివేదికను తయారు చేసి తనకు ఇవ్వాలని కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబును ఆదేశించారు.

పెద్దాసుపత్రిలో కేస్‌షీట్లకు టెండర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల కేస్ షీట్లకు బుధవారం అధికారులు టెండర్లు నిర్వహించారు. ఎన్‌ఏబీహెచ్ నిబంధనల మేరకు 48 పేజీల కేస్‌షీట్‌ను సరఫరా చేసేందుకు అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ మేరకు ఏడుగురు ప్రింటర్లు దరఖాస్తు చేసుకోగా ఐదుగురు హాజరయ్యారు. వారి ఎదురుగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఛాంబర్‌లో కమిటీ సభ్యుల సమక్షంలో టెండర్ బాక్స్ తెరిచారు. ఇందులో నలుగురు అర్హులు కాగా ముగ్గురు తక్కువకు కోట్ చేశారు. దీంతో ఆ ముగ్గురితో అధికారులు బేరసారాలు నడిపి ఒక్క కేస్‌షీట్‌కు రూ.16.10 కు ఇచ్చేలా టెండర్ పాడారు. దీంతో ఈ మేరకు శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, కర్నూలు వారికి టెండర్ దక్కింది. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి ఏడీ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

కర్నూలు సిటీ: పీఆర్‌టీయూ 2024 నూతన సంవత్సర డైరీని బుధవారం డీఈఓ డా.వి. రంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంచడంపై పీఆర్‌టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనమివ్వాలి

కర్నూలు(సెంట్రల్) : మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహం నుంచి ఏఐటీయూసీ కార్యాలయం వరకు పారిశుద్ధ్య కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు చంద్రశేఖర్, సాలు, ప్రేమరాజు, సాయి పాల్గొన్నారు.

7న నగర స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 7వ తేదీన స్థానిక కోల్స్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14 బాల బాలికల నగర స్థాయి రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌లైటెన్ కళాశాల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తారని తెలిపారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

కర్నూలు (సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం 5వ సెమిస్టర్ పరీక్షకు 91 శాతం మంది హాజరయ్యారు. మొదటి సెమిస్టర్ పరీక్షకు 88 శాతం మంది హాజరయ్యారు. కాగా వివిధ కాలేజీల్లో 13 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్‌యూ అధికారులు తెలిపారు.

ఒకే ఈతలో రెండు దూడలు



ఒకేఈతలో పుట్టిన రెండు దూడలతో రైతు కుటుంబం

కర్నూలు(అగ్రికల్చర్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో బుధవారం ఎస్. సలీమ్‌బాషాకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. ఆవులు, గేదేలకు ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం అరుదుగా జరుగుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

- స్పెషలిస్టు వైద్యులతో ఆరోగ్య పరీక్షలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 39వ వార్డు 102వ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడా కూడా లేని విధంగా ప్రతి గ్రామంలో ఇద్దరు స్పెషలిస్టులు ఏ ర్పాటు చేసి ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వా రా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క రు వైద్య పరీక్షలు చేయించుకుని ఏదైనా సమస్య ఉంటే మందులు వాడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధు లు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారు. అనంతరం పలువురికి కళ్ల అద్దాలు, కొత్త ఆరోగ్యశ్రీకార్డులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాంబశివరావు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.





మహిళకు ఆరోగ్య శ్రీ కార్డు అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్, వైద్యశిబిరంలో వృద్ధురాలికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య

ఆరోగ్య సమస్యలు తీర్చేందుకే ..

కర్నూలు(హాస్పిటల్): ప్రజల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన లక్ష్మీపురం, షరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ వైద్యశిబిరాలను సందర్శించి తనిఖీ చేశారు. కంటి పరీక్షలు జరిపి సర్జరీ జరిగిన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వచ్చిన రోగులందరికీ కూడా అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలని, స్పెషలిస్టు వైద్యుల వద్ద చెకప్ చేయించాలని తెలిపారు. అవసరమైన వారికి ఉన్నత ప్రమాణాలు కలిగిన హాస్పిటల్‌కు రెఫర్ చేయాలని చెప్పారు. ఈ రెండో దశ వైద్యశిబిరాలు జూన్ 30వ తేదీ వరకు నిర్వహిస్తారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, డాక్టర్ గౌతమి నాయక్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ జ్యోతి, కంటి వెలుగు ప్రోగ్రామ్ అధికారి సంధ్యారెడ్డి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు శేషారెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ వైద్యశిబిరం తనిఖీ

బుధవారం నగరంలోని ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్, ల్యాబ్ పరీక్ష, మెడికల్ ఆఫీసర్ కౌంటర్లు, మందులు ఇచ్చే కౌంటర్లు, స్పాట్ సర్వే కౌంటర్లు పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి అక్కడికి వచ్చిన పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్టు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు పీజీ వైద్య విద్యార్థులు, ఎస్‌ఆర్‌లు గాకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్‌లనే పంపించాలని వైద్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి మంజుల హోసిని, డీఎంఈ డాక్టర్ నరసింహం చెప్పారు. బుధవారం వారు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ కాలేజి,ఆసుపత్రి అధికారులతో చర్చించారు. వైద్య కళాశాలలో వైద్యుల సెలవులను ప్రిన్సిపాల్‌తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ కూడా సంతకం చేయాలని చెప్పారు. వైద్యు లు ఇకపై ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా హాజరు వేయాల్సిన అవసరం లేదని, ఎన్‌ఎంసీ ప్రవేశపెట్టిన ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా హాజరు వేయాలని చెప్పారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి పాల్గొన్నారు.

9 నుంచి జన్ భగీధరి సభలు నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): జనవరి 19వ తేదీన విజయవాడలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముందు ప్రతి దళితవాడలో సామాజిక న్యాయం అనే అంశంపై జన్ భగీధరి సభలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను గుర్తు చేసుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బుధవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జన భగీధరి సభలపై సమీక్షించారు. ఈ సభలను నిర్వహించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా, జేసీ మెంబర్ కన్వీనర్‌గా, మునిసిపల్ కమిషనర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు, డీఈఓ సభ్యులుగా ఉండే జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందన్నారు. జన్ భగీధరి కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయిలో తగిన తేదీని నిర్వహించి మారథాన్ నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజను ఆదేశించారు. ఈ నెల 4 నుంచి 8 వ తేదీ వరకు పాఠశాలల్లో అంబేడ్కర్‌పై డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఫ్లెక్సీ బ్యానర్లపై సంతకాలు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 17,18 తేదీల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం, మానవహారాలు నిర్వహించడం వంటివి చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాలన్నీ జిల్లా, మండలస్థాయిలో నిర్వహించాలని, ఆయా కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలని కలెక్టర్ డీఈఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓలను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఏపీకి తీవ్ర అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ప్రధాని మోదీ పాలనలో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌వలి విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని, పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పిన మోదీ ఒక్క దానిని కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఎం.సుధాకరబాబు, కె.లక్ష్మీనారాయణ రెడ్డి, దామోదరం రాధాకృష్ణ పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతలు అందజేత

కర్నూలు (సెంట్రల్) : అయోధ్య శ్రీరాముని అక్షింతలను విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి నగరంలోని ప్రముఖులకు వారి ఇళ్లకు వెళ్లి బుధవారం అందజేశారు. అయోధ్య అక్షింతలు అందుకున్న వారిలో కర్నూలు ఎంపీ డాక్టర్ జి.సంజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, టీడీపీ కర్నూలు అసెంబ్లీ కన్వీనర్ టీజీ భరత్, డీవీఆర్ హోటల్ అధినేత డి.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ఆలయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో దేశంలోని ప్రతి ఇంటికి శ్రీరాముని అక్షింతలను అందజేయనున్నట్లు నందిరెడ్డి సాయిరెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాల్సిందే

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల వేతనాలు పెంచే వరకు సమ్మెను విరమించమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారంతో 23వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాలను పెంచాలన్నారు. తెలంగాణ కంటే 1000 ఎక్కువ ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగాల నుంచి తొలగించేందుకు అవకాశం ఉండకూడదని చెప్పారు. కాగా, అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఉదయం 9 గంటల నుంచే అంగన్‌వాడీలు ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, గ్రామిక మహిళా కార్యదర్శి పి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పేదల పక్షపాతి సీఎం



మాట్లాడుతున్న కార్పొరేటర్ షేక్ యూనస్ బాషా

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని 10 వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనస్ బాషా అన్నారు. తన వార్డు పరిధిలోనే అర్హులైన పేదలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ. 13.80 కోట్లు అందజేశారని చెప్పారు. బుధవారం స్థానిక 25 వ సచివాలయం గుమ్మజ్ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఏనాడు పేద ప్రజలను పట్టించుకోలేదన్నారు. వివిధ రూపాల్లో మేలు చేస్తున్న వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మాబుసా, ఉపాధ్యక్షుడు ఫరాజ్‌ఖాన్, కన్వీనర్ నజీర్ ఖాన్, షబ్బీర్ ఖాన్, సమీర్‌ఖాన్, ఎమ్మెల్యే కార్యాలయం కో-ఆర్డినేటర్ ఎజాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే చేసి చూపిస్తారు



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే అమలుచేసి చూపిస్తారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎంపీపీ శారద పాల్గొన్నారు. మండలంలో కొత్తగా 129 మందికి పెన్షన్ మంజూరు కాగా వారందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి స్కోచ్ అంతర్జాతీయ సంస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవార్డు అందించిందని చెప్పారు. ఎంపీడీఓ రమణమూర్తి, నాయకులు కేశవరెడ్డి, నారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- ఆడుదాం – ఆంధ్ర క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (టౌన్): విద్యార్థులు, యువతీయువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని అందులో రాణించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడాకారులను వైఎస్‌ఆర్‌సీపీ ప్రోత్సహిస్తుందన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆడుదాం- ఆంధ్ర పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకు సర్కారు క్రీడాపోటీలు నిర్వహిస్తుందని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజేతల వివరాలు...

ఖో-ఖో పోటీల్లో వెంకటేష్ జట్టు 8-5 పాయింట్లతో గెలిచింది. వాలీబాల్ క్రీడాంశంలో మధు జట్టు 25-19 పాయింట్లతో మహేంద్ర జట్టుపై, కబడ్డీ క్రీడాంశంలో ప్రసాద్ జట్టు వెంకటేష్ జట్టుపై గెలుపొందింది. మహిళల ఖో-ఖో పోటీల్లో అంబికా జట్టు 16-9 స్కోరుతో ఫమీదా జట్టుపై విజయం సాధించింది. అలాగే మైపర్ క్రీడా మైదానంలో జొహరాపురం మారెమ్మ గుడి సచివాలయం పరిధి క్రీడాకారులకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వంశీ జట్టు 29-14 స్కోరుతో మహేష్ జట్టుపై, నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్‌లో శ్రీనగర్ కాలనీ సచివాలయం పురుషుల వాలీబాల్ పోటీల్లో నవీన్ జట్టు 30-18 స్కోరుతో మహబూబ్ జట్టుపై గెలుపొందింది. కబడ్డీ విభాగంలో వెంకటేష్ జట్టు 18-2 స్కోరుతో నవీన్ కుమార్ జట్టుపై, బ్యాడ్మింటన్ క్రీడాంశంలో సూర్యచంద్ర జట్టు 30-16 స్కోరుతో రాహుల్ జట్టుపై విజయం సాధించింది. ఉస్మానియా కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన తెలుగు గేరి సచివాలయం పరిధిలోని పురుషుల బ్యాడ్మింటన్ పోటీల్లో సయ్యద్ అర్బాజ్ జట్టు 30-26 స్కోరుతో జాకీర్ బేగ్ జట్టుపై గెలిచింది. మండిబజార్ సచివాలయానికి చెందిన పురుషుల బ్యాడ్మింటన్ పోటీల్లో షేక్ సమీర్ బాషా జంట 30-24 స్కోరుతో షాహిద్, ఎజాజ్‌పై గెలిచారు. కోల్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కాలికమ్మ దీదీ సచివాలయ పురుషుల బ్యాడ్మింటన్‌లో మనోహర్, ముషీద్ జంట 30-22 స్కోరుతో ప్రత్యర్థి జట్టుపై గెలుపొందింది. ఆయా క్రీడాపోటీల్లో ఇన్‌చార్జ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శారద, రత్నకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం- ఆంధ్ర పోటీలకు విశేష స్పందన

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర పోటీలకు అన్ని సచివాలయాల పరిధిలో విశేష స్పందన లభిస్తుందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్ అన్నారు. బుధవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో 24వ వార్డులోని 62 వ సచివాలయాల పరిధిలోని యువతీ, యువకులకు ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్‌తో పాటు ఖో-ఖో, కబడ్డీ పోటీలను టాస్ వేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలు, యవతీ, యువకుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులకు ఉచితంగా క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులు అందజేస్తుందన్నారు. నగర పరిధిలోని సచివాలయాల జట్ల మధ్య జరుగుతున్న పోటీలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేధార్ నాథ్, డిష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



స్టేడియంలో కబడ్డీ ఆడుతున్న సచివాలయ జట్లు



24 వ వార్డులో పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ నేత సయ్యద్ ఆసిఫ్

స్త్రీ విద్యకు ఆద్యురాలు సావిత్రీబాయి పూలే



మాట్లాడుతున్న మైనారిటీ సంక్షేమాధికారిణి సబీహా పర్వీన్



జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో..



సిల్వర్‌జూబ్లీ కాలేజీలో..

- ఘనంగా తొలి మహిళ ఉపాధ్యాయిని జయంతి వేడుకలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): దేశంలో మహిళల విద్యకు ఆద్యురాలు సావిత్రీబాయి పూలే అని పలువురు అధికారులు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సావిత్రీబాయి పూలే 193వ జయంతి సందర్భంగా బుధవారం పలు ప్రభుత్వ, ప్రజా సంఘాల కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక బీసీ భవన్ ఎదురుగా ఉన్న సావిత్రీబాయి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నగ ర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, సేవాదళ్ అధ్యక్షుడు కేదార్ నాథ్, ఆరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్ గౌతమ్, గోశాల డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, బేతం కృష్ణుడు, చంద్రికమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రీబాయి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ...

సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాలను బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్షుమ్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా ఆమె కీర్తి శిఖరాలను అందుకున్నారన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు ఆమె ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు శ్రీధర్, బీసీ కార్పొరేషన్ ఏఈఓ జాకీర్‌హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలో..

18వ శతాబ్దంలోనే సావిత్రీబాయి పూలే స్త్రీ విద్య ప్రాధాన్యతను గుర్తించి పోరాటం చేశారని జిల్లా గ్రంథా లయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క పేర్కొన్నా రు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో సావిత్రీ బాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాష, పద్మావతమ్మ పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు

కర్నూలు(అర్బన్): చదువుతోనే నేడు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని పలువురు మహిళా నేతలు అన్నారు. ఆ చదువును అందించిన తల్లులు సావిత్రీబాయి, ఫాతీమాషేక్‌ను ఎన్నటికి మరచిపోరాదన్నారు. బుధవారం స్థానిక సి. క్యాంప్ సెంటర్‌లోని టీజీవీ కళా క్షేత్రంలో చదువుల తల్లులు సావిత్రీబాయి పూలే, ఫాతిమాషేక్ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ డీసీహెచ్ నాగమ్మ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహా పర్వీన్, అధ్యాపకులు పార్వతి, అఖ్తర్‌భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత ఛాందసవాదుల దాడులను ఎదుర్కొని మహిళల విద్య కోసం, వితంతు పునర్‌వివాహాల కోసం నిరంతరం తపించారన్నారు. అలాగే మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలోనే ... ఉపాధ్యాయునులు ఆఫ్రీన్, హైమావతి, నిర్మల, సువర్ణకు వేదిక నేతలు మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రుద్రాక్షల ఇందిరాదేవి, పలు ప్రజా సంఘాల నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, టి. శేషఫణి, వేల్పుల జయచంద్ర, ఖదీరుల్లా, డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, ఎన్‌డీవీ అజీజ్, ఎరుకల రాజు, భరత్ కుమార్, వేదిక నాయకురాళ్లు భారతమ్మ, ఆకుతోట పద్మావతి, ఈరమ్మ, పెద్దక్క, ఖాసీంబీ, జానకమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారిణి

కర్నూలు(సెంట్రల్): సావిత్రీబాయిపూలే సామాజిక విప్లవకారిణి అని, ఆనాటి పరిస్థితుల్లోనే మహిళలకు విద్య అవసరమని గుర్తించిన గొప్ప సంఘ సంస్కర్త అని ఏపీ రజక వృత్తిదారులసంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆమె జయంతిని పురస్కరించుకొని సావిత్రీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి కార్యక్రమం నిర్వహించారు. శేఖర్‌బాబు, ఎల్లయ్య, కర్రెన్న, మద్దిలేటి, నరసింహ, గోవిందు, నాగరాజు, వీరేష్, శేఖర్, ఆర్.రమణ పాల్గొన్నారు.

ఆదర్శనీయులు సావిత్రీబాయి

కర్నూలు సిటీ: భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన సావిత్రీ బాయి పూలే ఆదర్శనీయులని చెప్పారు.

- సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీబాయి జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి ప్రసాద్‌రెడ్డి, స్త్రీ సాధికారత విభాగం కన్వీనర్ అక్తర్ భాను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలోని ప్రభుత్వ డైట్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వసుంధరా దేవి పాల్గొన్నారు. వీరితో పాటు కాలేజీ అధ్యాపకులు జనార్దన్ రెడ్డి, డా.ఆయూబ్ హుస్సేన్, డా.షంషుద్దీన్, వెంకటసుబ్బమ్మ, మనోహర్, ప్రభాకర్, రమేష్, ఛాత్రోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.
- ప్రభుత్వ వొకేషన్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, జబీన్ అక్తర్, లక్ష్మి, గిరిజా రాణి, ఉల్గోజిరావు, మల్లేశ్వరుడు, సుజాత, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు

వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ...

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఉన్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సావిత్రీబాయి పూలే 193 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, పార్టీ నగర అధ్యక్షుడు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి రాజకీయంగా, సామాజికంగా ఈ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య, వైఎస్‌ఆర్ సేవాదళ్ జిలా అధ్యక్షుడు కేధార్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.